సాక్షి ఖమ్మం

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



వదలని వర్షం

జిల్లాను వాన వెంటాడుతోంది. పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం మొదలైన వర్షం ఆదివారం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. 8లో



గొప్పతనాన్ని చాటేందుకే..

ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల గొప్పతనాన్ని చాటేందుకే పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించినట్లు బాధ్యులు తెలిపారు. 8లో



వాతావరణం

జిల్లా అంతటా సోమవారం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

టీపీసీసీ చీఫ్‌ను సన్మానించిన మంత్రి తుమ్మల



పీసీసీ చీఫ్‌ను సన్మానిస్తున్న మంత్రి

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేష్‌కుమార్ నేతృత్వాన పార్టీ మరింత ముందుకు సాగుతుందని తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యాన సోమవారం(నేడు) కలెక్టరేట్‌తో పాటు మండల తహసీల్దార్ కార్యాలయాల్లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కార్యాలయాలకు రావొద్దని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

13న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్–14, 16, 18, 20 బాలబాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

రెస్క్యూ టీమ్‌కు లైఫ్ జాకెట్లు



లైఫ్‌జాకెట్లు అందిస్తున్న డీఎఫ్‌ఓ

ఖమ్మంవన్‌టౌన్: ముంపు ప్రాంతాల్లో ఏ సమస్య ఎదురైనా రెస్క్యూ ఆపరేషన్ సమర్థవంతంగా నిర్వహించాలని డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ సూచించారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టే సిబ్బందికి ఆదివారం ఆయన లైఫ్ జాకెట్లు, స్పీకర్లను అందజేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉంటూనే బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. కాగా, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తన నెల వేతనాన్ని వరద బాధితులకు ఇవ్వడంతో ప్రేరణ పొందిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.సురేష్‌కుమార్ కుమార్తె కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న నగదు అందించింది.

కొలువుదీరిన గణపయ్య



ఖమ్మం బ్రాహ్మణబజార్‌లోని 32 అడుగుల మట్టి విగ్రహం

జిల్లాలోని ఊరూవాడా వినాయకుడు కొలువుదీరాడు. శనివారం ఉదయం నుంచే మండపాల నిర్వాహకులు విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే, శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు చాలా ప్రాంతాల్లో వర్షం కురవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఇక మున్నేటి వరదతో ఖమ్మం నగరం, రూరల్ మండలాల్లో పలు ప్రాంతాల్లో దెబ్బతినగా ఈసారి వినాయక మండపాల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది.

- ఫొటోలు : 9లో

బడి బాగయ్యేదెలా?

ఖమ్మం, రూరల్ మండలం పాఠశాలల్లో ఇంకా ఇక్కట్లే

- పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు బురదమయం
- జిల్లావ్యాప్తంగా దెబ్బతిన్న 71 పాఠశాలలు
- పాఠ్య, నోట్ పుస్తకాలు లేక ఆందోళనలో విద్యార్థులు
- నేడు కూడా పలు ప్రాంతాల్లో బడులకు సెలవు
- మిగతా చోట్ల మొదలుకానున్న విద్యాసంస్థలు



బొక్కలగడ్డలో పుస్తకాలు ఆరబెడుతున్న విద్యార్థులు దివ్య, అభిషేక్, శాన్విత (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వరద ప్రభావంతో జిల్లావ్యాప్తంగా దెబ్బతిన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా బురదమేటలు, ముురుగుకంపు తొలగలేదు. ఓవైపు శానిటేషన్ సిబ్బందితో పాఠశాలల్లో బురద, చెత్తాచెదారాన్ని తీయిస్తున్నారు. అయితే, భారీగా బురద మేటలు వేయడం, కంప్యూటర్లు, ఫర్నీచర్, పుస్తకాలు, రికార్డులు తడిసిపోవడంతో పరిస్థితులు చక్కబడడానికి ఇంకా సమయం పడుతుంది. భారీ వర్షాల నేపథ్యాన ఖమ్మం కార్పొరేషన్, ఖమ్మం రూరల్ మండలాల్లోని అన్ని పాఠశాలలకు సోమవారం కూడా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సెలవు ప్రకటించారు. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం విద్యాసంస్థలు తెరుచుకుంటాయని తెలిపారు.

71 పాఠశాలలపై ప్రభావం

జిల్లాలోని 1,216 పాఠశాలల్లో 65,904 మంది విద్యార్థులు చదువుతున్నారు. భారీ వర్షాలతో 71 పాఠశాలలు దెబ్బతిన్నాయి. మున్నేరు పరీవాహక ప్రాంతంలో పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. బడుల్లో బురద పేరుకుపోవడంతో 30 నుంచి 40 పాఠశాలలకు తీవ్రనష్టం జరిగింది. కంప్యూటర్లు, విద్యార్థులకు చెందిన పుస్తకాలు, రికార్డులు, వరదల్లో కొట్టుకుపోయాయి. మున్నేరు పరీవాహకం పరిధిలోని 4వేల మంది విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు వరద పాలయ్యాయి.



జలగంనగర్ మండల పరిషత్ పాఠశాలలో పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్ష, ఉద్యోగులు

ఒక్క పుస్తకం కూడా లేదు..

వరద వచ్చి వారం గడిచినా ఇంకా సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అలాగే ఇళ్లను శుభ్రం చేసుకోవడం పూర్తి కాలేదు. ఈక్రమంలో ఆయా ప్రాంతాల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే అవకాశం కనిపించడం లేదు. వీరు పాఠశాలలకు వెళ్లినా పాఠ్య, నోట్‌పుస్తకాలు లేవు. మరోవైపు పాఠశాలల్లో నిల్వ ఉన్న పుస్తకాలు కూడా తడిసి ముద్దయ్యాయి. ఫలితంగా ఉపాధ్యాయులకు పాఠం చెప్పడం కూడా కష్టమవుతుందని భావిస్తున్నారు. మరోవైపు కొన్ని తరగతుల విద్యార్థులకు ఎస్‌ఏ–1 పరీక్షలు ఉండడంతో ఎలా చదువుకోవాలా అన్న మీమాంస వెంటాడుతోంది.

కేఎంసీతో పాటు రూరల్ మండలంలో సెలవు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధితో పాటుఖమ్మం రూరల్ మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధి విద్యాసంస్థలకు సోమవారం కూడా సెలవు ప్రకటించారు. ఈవిషయాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలోని మిగతా మండలాల్లోని విద్యాసంస్థలు యథావిధిగా సోమవారం నుంచి కొనసాగుతాయని తెలిపారు.



ఖమ్మం రూరల్ మండలం ఎమ్మార్సీలో బురదమయమైన రికార్డులు, కంప్యూటర్లు

మండలాల వారీగా వరద తాకిడికి గురైన పాఠశాలలు

ఖమ్మంఅర్బన్	12	మధిర	04	కామేపల్లి	02
ఏన్కూరు	09	రఘునాథపాలెం	04	బోనకల్	02
ఖమ్మంరూరల్	08	తిరుమలాయపాలెం	04	చింతకాని	01
నేలకొండపల్లి	06	కూసుమంచి	03	సత్తుపల్లి	01
కారేపల్లి	05	పెనుబల్లి	03	ఎర్రుపాలెం	01
కొణిజర్ల	04	వేంసూరు	02	మొత్తం	71

రాజకీయాలకు అతీతంగా ఆదుకుంటాం..

- సామాజిక సంస్థలు సైతం ముందుకు రావాలి..
- త్వరలో నష్టం అంచనాలకు కేంద్ర బృందం పర్యటన
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి
- మంత్రి పొంగులేటి, ఎంపీలతో కలిసి వరద ముంపు ప్రాంతాల్లో పరిశీలన



వరద బాధితులకు సామగ్రి అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్‌రెడ్డి, పొంగులేటి, ఎంపీలు ఈటల, విశ్వేశ్వరరెడ్డి తదితరులు



వరదతో పుస్తకాలు తడిశాయని మంత్రులకు వివరిస్తున్న విద్యార్థినులు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం మామిళ్లగూడెం: రాజకీయాలను పక్కనపెట్టి రాష్ట్రంలోని వరద బాధితులను ఆదుకుంటామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం 16వ డివిజన్ ధంసలాపురంతో పాటు తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో వరద బాధితులను ఆదివారం ఆయన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చేవెళ్ల, మల్కాజ్‌గిరి ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌తో కలిసి పరామర్శించారు. తొలుత ఆయనకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ధంసలాపురం కాలనీలో వరద బాధితులైన వెంకటనారాయణ చారి, షేక్ బుజ్జి, ఆశా సుల్తానా, షరీఫ్, వి.సమ్మక్కతో పాటు పలువురి ఇళ్లను పరిశీలించి ఓదార్చారు. అక్కడి నుంచి బయలుదేరి వెళ్తుండగా కాన్వాయ్‌కి ఎదురెళ్లిన పలువురు మహిళలు తమ పరిస్థితి చెప్పుకుని కంటతడి పెట్టడంతో ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని, అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యాన వరద బాధితులకు నిత్యావసర సామగ్రి పంపిణీ చేశారు.

కనీవినీ ఎరగని వరద

ఈసందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో మునుపెన్నడూ లేని రీతిలో వరద రావడంతో సర్వం కోల్పోయిన వారిని రాజకీయాలకు అతీతంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వ సమన్వయంతో ఆదుకుంటామని తెలిపారు. త్వరలోనే కేంద్రబృందం పర్యటించి నష్టంపై అంచనా వేస్తుందని చెప్పారు. అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే విపత్తు సమయంలో ఇవ్వాల్సిన నిధులపై రూపొందించిన విధివిధానాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తామని తెలి పారు. గత ప్రభుత్వం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను సైతం వాడుకోలేదనే సమాచారం ఉందని, కేంద్ర హోంశాఖ ఆధీనంలోని ఆ నిధులను తిరిగి ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న వేళ సామాజిక సంస్థలు కూడా ముందుకు రావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

వెనకడుగు వేసేది లేదు..

విపత్తు సంభవించిన వేళ ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను ఆదుకునేందుకు వెనకడుగు వేయొద్దని సూచించారని.. వారికి ప్రజల పక్షాన విపత్తు నిర్వహణ శాఖ మంత్రి మంత్రిగా కృతజ్ఞతలు చెబుతున్నానని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ధనిక రాష్ట్రమని చెప్పకుండా యథార్థాన్ని వివరించి కేంద్రం నుండి నిధులు అడగడంలో భేషజాలకు పోవడం లేదని, కేంద్రంతో కలిసి పనిచేసేందుకు వెనక్కి తగ్గబోమని చెప్పారు. ఆనాడు ప్రధాని వస్తే సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి కలిసి బడేభాయ్ అంటే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. ఇప్పటివరకు రూ.5,438కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కేంద్రానికి నివేదిక ఇచ్చినందున జాతీయ విపత్తుగా ప్రకటించి అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. కాగా, ప్రభుత్వం ప్రకటించిన సాయం సోమవారం నుంచి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ, శ్యాం రాథోడ్, నున్నా రవి, అల్లిక అంజయ్య, మందడపు ప్రభాకర్‌రెడ్డి, నంబూరి రామలింగేశ్వరరావు, దేవకీ వాసుదేవరావు, తాండ్ర వినోద్‌రావు, రుద్ర ప్రదీప్, కార్పొరేటర్ డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..



ముదిగొండ : వల్లభిలో బోటిచెరువు వద్ద కొట్టుకుపోయిన రహదారిని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

- పంటల నష్టంపై అంచనా వేయండి
- మధిర నియోజకవర్గ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి



మధిర : వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన పద్మావతి కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న భట్టి విక్రమార్క

మధిర/ముదిగొండ/చింతకాని/బోనకల్/ఎర్రుపాలెం: మరికొద్ది రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే సమాచారం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. అలాగే, పంటల నష్టంపై క్షేత్రస్థాయిలో పర్యటించి త్వరగా అంచనాలు రూపొందించాలని సూచించారు. మధిర మండలంతో పాటు ముదిగొండ, చింతకాని, బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో భట్టి ఆదివారం పర్యటించారు. ఈసందర్భంగా మధిర మండలం చిలుకూరులో వరద ముంపునకు గురైన పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళిక రూపొందిస్తోందని తెలిపారు. అలాగే, దెందుకూరులో వరదకు కొట్టుకుపోయి మృతి చెందిన నన్నెబోయిన పద్మావతి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. అలాగే, ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన ముదిగొండ పీహెచ్‌సీని తనిఖీ చేయగా వైద్యులు లేక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు చెప్పడంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వనంవారికిష్టాపురంలో ఇటీవల మృతిచెందిన కోయ శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి వల్లభిలో బోటిచెరువుకు గండి పడి రోడ్డు తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు. చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో సైతం వరద ఉధృతికి నష్టపోయిన పంట పొలాలు, కొట్టుకపోయిన రహదారులను భట్టి పరిశీలించి మాట్లాడుతూ నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు. అలాగే, ధ్వంసమైన మత్కేపల్లి–తిరుమలాపురం రహదారి, తిమ్మినేనిపాలెంలో మున్నేరు, నాగులవంచలో బండిరేవును పరిశీలించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇక బోనకల్ మండలం ముష్టికుంట్ల బీసీ, ఎస్సీ కాలనీలను పరిశీలించి ముంపు వివరాలపై ఆరా తీశాక ఎన్నెస్పీ కాల్వ నుంచి రైతువేదిక వరకు సైడ్ డ్రెయిన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఇక ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు, భవానీపురం గ్రామాల్లో సైతం నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం.. భవానీపురంలో వరద కారణంగా మృతి చెందిన మలిశెట్టి సాంబశివరావు తల్లికి రూ.5లక్షల పరిహారం చెక్కు అందచేశారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ గణేష్, వివిధ శాఖల అధికారులు నర్సింహారావు, అనంతరాజు, రామయ్య, సురేష్, పున్నంచందర్, శాస్త్రి, టి.వెంకటేశ్వర్లు, ఉషాశారద, సురేందర్‌తో పాటు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు పోట్ల నాగేశ్వరరావు, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సూరంశెట్టి కిషోర్, కోనా ధనికుమార్, కొమ్మినేని రమేష్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, బిచ్చాల బిక్షం, పైడిపల్లి కిషోర్, బంధం నాగేశ్వరావు, గాలి దుర్గారావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, బండారు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉరుకులు పెట్టించిన మున్నేరు

- అర్ధరాత్రి వేళ పెరిగిన వరద
- 15.75 అడుగులకు చేరాక తగ్గుముఖం

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద అధికార యంత్రాంగాన్ని ఉరుకులు, పరుగులు పెట్టిస్తోంది. ఈనెల 1న ఒక్కసారిగా వచ్చిన భారీ వరదల నుంచి తేరుకోకముందే మరోసారి మున్నేరుకు వరద ముప్పు పొంచి ఉందన్న సమాచారంతో యంత్రాంగం అప్రమత్తమైంది. శనివారం రాత్రి 8గంటల నుండి మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో కార్పొరేషన్, పోలీస్ సిబ్బంది మోహరించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సైతం పునరావాస కేంద్రాలకు వెళ్లి బాధితులతో మాట్లాడారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. శనివారం రాత్రి నుండి మున్నేరు వరద పెరుగుతూ వచ్చి ఆదివారం మధ్యాహ్నం తర్వాత తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శనివారం సాయంత్రం 6.30గంటలకు 8.25అడుగులుగా ఉన్న మున్నేరు ప్రవాహం రాత్రి 8.30గంటలకు 9.50, 10.40గంటలకు 12.80, అర్ధరాత్రి 12గంటలకు 14.80, ఆదివారం తెల్లవారుజామున 2గంటలకు 15.20, ఉదయం ఆరు గంటలకు 15.50, ఏడు గంటలకు 15.75 అడుగులకు చేరాక తగ్గడం మొదలైంది. ఉదయం 8.30గంటలకు 15, 10గంటలకు 14.50, మధ్యాహ్నం 12గంటలకు 14, రెండు గంటలకు 13.50, సాయంత్రం నాలుగు గంటలకు 13.10 అడుగులకు పడిపోయి, ఆరు గంటల తర్వాత 13.10అడుగుల మేర నిలకడగా కొనసాగింది.



మున్నేరు వరద పరిస్థితిపై సీపీ సునీల్‌దత్‌తో చర్చిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

8,200 మందికి భోజనం

మున్నేరుకు వరద హెచ్చరికతో అధికారులు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. దీంతో కేంద్రాలు ఆదివారం కిటకిటలాడాయి. ఖమ్మంలోని పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 8,200 మందికి అధికారులు ఆదివారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాలు సమకూర్చారు. వరద తగ్గుముఖం పట్టడంతో రాత్రి చాలామంది ఇళ్లకు వెళ్లిపోగా.. కొందరు మాత్రం కేంద్రాల్లోనే ఉన్నారు.

ధరల దందా..

- అన్నీ కొనుగోలు చేయాల్సిన పరిస్థితుల్లో బాధితులు
- ఇదే అదునుగా ధరలు పెంచిన వ్యాపారులు
- అల్పాహారం మొదలు సరుకుల వరకు చుక్కలనంటుతున్న ధరలు
- తాత్కాలికంగా అద్దెకైనా వారం చొప్పున వసూళ్లు
- రెట్టింపవుతున్న మున్నేరు ముంపు బాధితుల అవస్థ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మున్నేరు ముంపులో సర్వం కోల్పోయిన వారికి పెరిగిన ధరలు మరింత ఆవేదనను కలిగిస్తున్నాయి. సర్వం తుడిచి పెట్టుకుపోవడంతో ఏ వస్తువైనా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. అల్పాహారం నుంచి నిత్యావసర సామగ్రి వరకు కొనుగోలు చేయాల్సి ఉండడం.. అందుకోసం షాపులకు వెళ్తే చెప్పే ధరలు చూసి బాధితులు అవాక్కవుతున్నారు. అయినా చేసేదేం లేక కొందరు కొనుగోలు చేస్తుండగా.. మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

చేతిలో చిల్లిగవ్వలేక..

ఖమ్మంలోని 14 డివిజన్లు, ఖమ్మంరూరల్ మండలంలోని 20 కాలనీల్లో ఎక్కువమంది రోజువారీ పనులు చేసుకుని జీవించేవారే. ఇళ్లల్లో పనులు, వ్యవసాయ మార్కెట్‌లో హమాలీలుగా, ఆటో డ్రైవర్లుగానే కాక ఇతర చిన్న పనులు చేసుకుని పొట్ట పోసుకుంటారు. వీరంతా కూడబెట్టుకుని కొనుగోలు చేసిన గృహోపకరణాలు, తిండి గింజలు సహా మున్నేరు తనలో కలిపేసుకోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. నిరాశ్రయులైన వీరు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. ప్రస్తుతం ఇళ్లకు చేరుకుని బురద, మిగిలిన సామగ్రి శుభ్రం చేసుకోవాల్సి రావడంతో అటు పనులకు వెళ్లే పరిస్థితి లేక ఆదాయం కోల్పోయి ప్రభుత్వం, దాతలు ఇచ్చే ఆహారంపైనే ఆధారపడుతున్నారు.


చుక్కల్లో ధరలు

బురదమయంగా ఉన్న ఇళ్లల్లో వంట చేసుకునే వీలు లేక.. సామగ్రి కోల్పోయి ప్రతీది కొనుగోలు చేయాల్సి వస్తోంది. బురద తొలగించాక ఇళ్లను కడగడానికి వైపర్ కొనుగోలు చేయాలన్నా రూ.300 చెబుతున్నారని కొందరు బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఇక టీ, టిఫిన్ చేయాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి నెలకొంది. గతంలో రూ.20కు ఇచ్చిన టిఫిన్ ఇప్పుడు రూ.50 తీసుకుంటున్నారు. ఇక చీపుర్లు, బ్లీచింగ్, బుట్టలు ఇలా ఏదైనా సరే ధరలు అమాంతం పెరగడంతో బాధితులు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

మండుతున్న ఇళ్ల కిరాయిలు

మున్నేరు ముంపు ప్రాంతంలోని అనేక ఇళ్లలో బురద, చెత్త పేరుకుపోవడతో దుర్వాసన ఇంకా తగ్గలేదు. మరోవైపు వరద భయం పూర్తిగా వీడలేదు. కొందరు పగటి వేళ ఇళ్లు శుభ్రం చేసుకుని, తిరిగి రాత్రి పునరావాస కేంద్రాలకు వెళ్తున్నారు. ఇంకొందరు సమీప కాలనీల్లో ఇళ్లు అద్దెకు తీసుకుని ఉందామని భావిస్తే కిరాయి విపరీతంగా చెబుతున్నట్లు సమాచారం. వారం రోజులకు ఒక్కొక్కరికి రూ.700 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. దీనికి తోడు డబ్బు ముందే చెల్లించాలనే నిబంధనలతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

డబ్బు ముందు ఇవ్వాల్సిందే..



ఈయన మోతీనగర్‌కు చెందిన జన్ను శ్రీను. ఓ చికెన్ షాపులో పనిచేస్తాడు. వరద ముంచెత్తడంతో వారం రోజులుగా పనికి వెళ్లకపోవడంతో చేతిలో డబ్బు లేదు. మరోపక్క బురదమయంగా మారిన ఇంట్లో ఉండేందుకు వీలు లేదు. దీంతో రాత్రి వేళ మాత్రమే ఉండేలా అద్దె ఇంటి కోసం వెతికాడు. అయితే ఇంటి యజమానులు మనిషికి వారానికి రూ.700 నుంచి రూ.వెయ్యి చొప్పున అడుగుతున్నారని శ్రీను వాపోయాడు.

రూ.50 చెల్లిస్తేనే టిఫిన్



మోతీనగర్‌కు చెందిన ఉమేష్‌చంద్ర గ్రానైట్ రాళ్లపై బొమ్మలు, చెక్కే ఆర్టిస్ట్. వరదలో ఆయన ఇల్లు కొట్టుకుపోయి కట్టుబట్టలు తప్ప మరేమీ మిగల్లేదు. వారం రోజులుగా పని లభించట్లేదు. బంధువులు, స్నేహితులు ఎంతో కొంత ఖర్చుల కోసం ఇస్తున్నారు. బయట ఏదైనా కొందామంటే ధరలు చూసి భయమేస్తోందని, టిఫిన్ చేద్దామని వెళ్తే వరదలకు ముందు రూ.30 ఉన్న ప్లేట్ ఇప్పుడు రూ.50 తీసుకున్నారని తెలిపాడు.

క్లుప్తంగా

అంత్యక్రియలకు ఇక్కట్లు


మృతదేహంతో బురదలో నుంచి వెళ్తున్న బంధువులు

వైరా: ఎడతెరిపి లేని వర్షాలు, రహదారులపై బురదతో అంత్యక్రియలకు సైతం ఇక్కట్లు ఎదురవుతున్నాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1, 2వ వార్డుల్లో వర్షాకాలం వచ్చిందంటే ఈ సమస్య సర్వసాధారణమవుతోంది. రెండో వార్డుకు చెందిన పల్లపు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లేందుకు కుటుంబీకులు, బంధువులు పడిన బాధలు అంతా ఇంతా కావు. ఓ వైపు వర్షం, మరోవైపు రిజర్వాయర్‌కు ఆనుకుని ఉన్న శ్మశానవాటికలోకి నీరు చేరడంతో అవస్థ పడ్డారు. బురదలో నుంచే శ్మశానానికి చేరుకుని అంత్యక్రియలు పూర్తిచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఏడాది కాలానికి అప్రెంటిస్ షిప్ కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఐటీఐ ఉత్తీర్ణులై నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగిన వారు అర్హులని, ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సు చేసిన వారు అర్హులు కాదని అధికారులు వెల్లడించారు. ఈనెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు www.apprenticeshipindia.org లేదా www.scclmines.com/ apprentice ship ద్వారా దరఖాస్తు చేసుకుని సంబంధిత పత్రాలు, సర్టిఫికెట్లతో ఈనెల 10 నుండి ఆయా ఏరియాల ఎంవీటీసీ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. 80 శాతం సీట్లు సంస్థ ఉద్యోగులు, కార్మికుల పిల్ల లు, ప్రభావిత ప్రాంత నిరుద్యోగులకు కేటాయించగా మిగిలిన 20 శాతం తెలంగాణలోని ఆరు జిల్లాల్లో గల నిరుద్యోగ యువతకు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారికి నెలకు రూ.8,050, ఏడాది కోర్స్ చేసిన వారికి మస్టర్ల ఆధారంగా నెలకు రూ.7,700 చెల్లిస్తామని తెలిపారు.

తుమ్మలమ్మ చెరువులో వ్యక్తి గల్లంతు

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామ తుమ్మలమ్మ చెరువులో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం నందగిరికి చెందిన పిల్లి వీరయ్య (58) ఆదివారం గల్లంతయ్యాడు. ఆయన చింతకాని మండలం జగన్నాథపురంలో తన కుమార్తె వద్ద మూడేళ్లుగా ఉంటున్నాడు. గ్రామస్తులు ఇద్దరితో కలిసి తుమ్మలమ్మ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వీరయ్య వల పెట్టేందుకు చెరువులోకి దిగి గల్లంతయ్యాడు. దీంతో ఆయన వెంట ఉన్న ఇద్దరు స్థానికులకు తెలపగా గ్రామస్తులు తహసీల్దార్ అనంతరాజు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరయ్య ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలించినా రాత్రి వరకు లభ్యం కాలేదు. దీంతో తహసీల్దార్ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు చేరకునే సరికి చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు.

ఆర్టీసీ బస్సు - ట్యాంకర్ ఢీ, తప్పిన ప్రమాదం


ఘటనా స్థలిలో ఆర్టీసీ బస్సు, ట్యాంకర్

ఏన్కూరు: ఆయిల్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా తృటిలో ప్రమాదం తప్పింది. భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యలో ఏన్కూరు మండలం గార్లఒడ్డు వద్ద రోడ్డు పక్కన నిలిపిన యాష్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై బస్సుడ్రైవర్ రమేశ్ మాట్లాడుతూ.. ఎదురుగా రెండు కార్లు వసుండటంతో బ్రేక్ వేసి పక్కకు తప్పించే క్రమాన రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొట్టినట్లు తెలిపారు. కాగా, ఘటనపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు.

ఎన్‌కౌంటర్ ప్రాంతం పరిశీలన


ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

కరకగూడెం: ఈ నెల 5న మావోయిస్టులకు, పోలీ సులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన మండలంలోని రఘునాథపాలెం, మోతె గ్రామాల పరిధిలోని దోనాల గుట్ట అటవీ ప్రాంతాన్ని దర్యాప్తు అధికారి, ములుగు జిల్లా ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ శనివారం పరిశీలించారు. గ్రేహౌండ్స్ బలగాలతో మాట్లాడి ఎన్‌కౌంటర్ జరిగిన తీరును తెలుసుకున్నారు. అంతకుముందు కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట ఏడూళ్లబయ్యారం ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392


కోయచలక - కోటపాడు మధ్య తెగిపోయిన రహదారి

వదలని వర్షం

- పలు మండలాల్లో భారీ వర్షపాతం నమోదు
- మిగిలిన మండలాల్లో ఓ మోస్తరు వర్షం

శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు పలు మండలాల్లో వర్షపాతం (మి.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
తల్లాడ	126.2
కల్లూరు	115.2
రఘునాథపాలెం	92.4
వైరా	90.8
కొణిజర్ల	90.4
వేంసూరు	87.2
పెనుబల్లి	64.2
సింగరేణి	61.8
ఖమ్మం రూరల్	59.6
ఖమ్మం అర్బన్	57.2
కామేపల్లి	45.4
తిరుమలాయపాలెం	38.2
నేలకొండపల్లి	35.8
సత్తుపల్లి	32.2

ఖమ్మంవ్యవసాయం: జిల్లాను వాన వీడటం లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వానలు ముంచెత్తుతున్నాయి. దాదాపు పది రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం మొదలైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. తల్లాడ మండలంలో అతి భారీ వర్షం కురవగా, కల్లూరు, రఘునాథపాలెం, వైరా, కొణిజర్ల, వేంసూరు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆగకుండా వాన పడుతుండటంతో మళ్లీ ఏ విపత్తు ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే, ఆదివారం సాయంత్రం తర్వాత వర్షం తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, వరుస వర్షాలు పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. పత్తి తేమ బారిన పడి దెబ్బతింటుండగా ఇతర పంటలకు కూడా నష్టం కలుగుతోంది. ఇప్పటికే 6,830 మంది రైతులకు చెందిన 8,769 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ సర్వేల్లో గుర్తించింది. సోమవారం నాటికి సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించే అవకాశముంది. కాగా, ఆదివారం ఉదయం 8-30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వేంసూరులో 32.5, సత్తుపల్లి మండలంలోని సదాశివపేటలో 32, గంగారంలో 31, సత్తుపల్లిలో 28.5, పెనుబల్లి మండలం గౌరారంలో 22 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది.

నిలిచిన రాకపోకలు

రఘునాథపాలెం: వారం కిందట వరదతో రఘునాథపాలెం మండలంలోని కోయచలక - కోటపాడు మధ్య ఆర్అండ్‌బీ రహదారి తెగిపోగా పైపులు వేసి తాత్కాలిక మరమ్మతు చేశారు. అయితే, శనివారం రాత్రి మళ్లీ వర్షం రావడంతో మట్టి కొట్టుకుపోయి పైపులు సైతం కానరాకుండా పోయాయి. ఫలితంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక వీఆర్ బంజర - పాపటపల్లి మధ్య బుగ్గవాగు ఉప్పొంగడంతో శనివారం రాత్రి నుంచి ఖమ్మం - డోర్నకల్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


వీఆర్.బంజర-పాపటపల్లి మధ్య బుగ్గవాగు ప్రవాహం

820 బృందాలతో వైద్య సేవలు

నేలకొండపల్లి/ముదిగొండ: జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలందించేందుకు 820 బృందాలను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు తెలిపారు. నేలకొండపల్లి మండలంలోని బోదులబండతో పాటు ముదిగొండ, వల్లభి పీహెచ్‌సీలను ఆదివారం తనిఖీ చేసిన ఆయన వైద్యసేవలపై ఆరా తీశాక సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో 460 డెంగీ కేసులు నమోదు కాగా, వర్షాలతో జ్వరపీడిత కేసులు తగ్గాయని చెప్పారు. అయితే, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ దోమలు దరిచేరకుండా కాపాడుకోవాలని సూచించారు. వైద్యాధికారులు గీత, అరుణాదేవి, ధర్మేందర్, సిబ్బంది పాల్గొన్నారు.


ముదిగొండ పీహెచ్‌సీలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ సుబ్బారావు

విద్యార్థి చికిత్సకు రూ.1.57 లక్షల సాయం

ఏన్కూరు: కష్టాల్లో ఉన్న విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థులు ఆపన్నహస్తం అందిస్తూ ఔదార్యం చాటుకుంటున్నారు. ఏన్కూరుకు చెందిన మేనుగు నాగరాజు స్థానిక గురుకల పాఠశాలలో చదివి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయన హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. నాగరాజు తల్లిదండ్రులు కూలి పనులు చేస్తున్నట్లు తెలుసుకున్న గురుకులం పూర్వ విద్యార్థులు స్పందించారు. ఆదిలాబాద్‌లో ఉద్యానశాఖ అధికారిగా పనిచేస్తున్న గుడిమళ్ల సందీప్‌కుమార్ ఆధ్వర్యాన రూ.1.57 లక్షలు సేకరించి హైదరాబాద్‌లో నాగరాజు చికిత్స కోసం ఆయన తల్లిదండ్రులు శ్రీనివాసరావు, విజయకు శనివారం అందించారు.


నాగరాజు తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

రఘునాథపాలెం: గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన బండి నాగేశ్వరరావుగౌడ్ ఎన్నికయ్యాడు. గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి మరికంటి వెంకట్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మోకుదెబ్బ, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ బాధ్యులు అమరగాని నర్సింలగౌడ్, అమరగాని వెంకన్నగౌడ్, రాగుల సిద్దిరాములుగౌడ్, ముత్యం నర్సింలుగౌడ్, రాగుల కిరణ్ కుమార్‌గౌడ్, భైరి అనిల్‌కుమార్‌గౌడ్ తదితరులు హాజరయ్యారై మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం గౌడ కులస్తులకు అన్ని రంగాల్లో వాటా కోసం పోరాడుతూ పలు హక్కులను సాధించామన్నారు. ఆరేళ్లుగా జిల్లాలో మోకుదెబ్బ సంఘాన్ని పటిష్టం చేసిన మందా రామారావుగౌడ్ మృతి తీరని లోటని చెప్పారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా నాగేశ్వరరావుగౌడ్‌తో పాటు గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ కేశగాని రాజశేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తండ ఉప్పలయ్యగౌడ్, ఇతర పదవులకు తాళ్ల శ్రీనివాస్, బిచ్చల అన్వేశ్, మరికంటి వెంకట్, బొలికొండ శ్రీనివాస్, పంది శ్రీనివాస్, గడ్డమీది రామారావు, బండి ఉపేందర్, గడ్డం ఉపేందర్, తిరుమల్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.


నాగేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ గొప్పతనం చాటేందుకే 'పూర్వ' సమ్మేళనం


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో చదివిన వేలాది మంది ఉన్నత స్థాయికి చేరారని.. ఈ గొప్పతనాన్ని నలుమూలలా చాటేందుకే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించినట్లు వక్తలు పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యాన పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించగా తొలుత భూమి విరాళ దాత గెంటేల నారాయణరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత మరణించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులకు నివాళిగా మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షత వహించిన కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ఈ సమ్మేళనం నిర్వహణ కోసం ఏడాదిగా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఢిల్లీ ఇగ్నో ప్రొఫెసర్ ఎం ఎస్ సీనంరాజు మాట్లాడుతూ.. కళాశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం పాటు పడాలని కోరారు. ప్రధాన కార్యదర్శి వీరెల్లి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా కోర్టు, ఐటీ హబ్ తరలించే పక్షంలో ఆ భవనాలు కళాశాలకు కేటాయించాలని కోరారు. హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు, భరత్ విద్యాసంస్థల అధిపతి శీలం వెంకటరెడ్డి, ఎస్.మణిభూషణాచారి మాట్లాడగా పూజారి గణాశంకర్ రూపొందించిన డాక్యుమెంటరీతో పాటు అఖండ జ్ఞానజ్యోతి గెంటేల నారాయణరావు, చదువులమ్మ ఒడిలో జ్ఞాపకాలం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బిచ్చాల తిరుమల్‌రావు, నాళ్ల భానుచందర్, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, మల్లం రమేశ్, పుల్లయ్య, జాన్, గోపిచంద్, దీకొండ చంద్రకళ, మదార్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కగానొక్క బిడ్డను కాపాడండి

- 11 ఏళ్ల బాలికకు రక్తకణాల సమస్య
- చికిత్సకు దాతలు చేయూతనివ్వాలని తల్లిదండ్రుల వేడుకోలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విన్సీ


మధిర: ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బిడ్డ చికిత్సకు దాతలు సహకరించి ఒక్కగానొక్క బిడ్డను కాపాడాలని మధిరకు చెందిన పెరుమాళ్లపల్లి రవికుమార్ - ప్రసన్న దంపతులు వేడుకుంటున్నారు. మధిర సిద్దారెడ్డిబజార్‌కు చెందిన రవికుమార్ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తూ విజయవాడలో మూడేళ్లుగా నివసిస్తున్నారు. ఆయన భార్య ప్రసన్న గృహిణి. వీరికి కుమారుడు వరుణ్ (11), కుమార్తె విన్సీ జన్మించగా మూడేళ్ల కిందట రక్తకణాల సమస్య ఏర్పడి వరుణ్ కన్నుమూశాడు. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్న 11 ఏళ్ల విన్సీ కూడా అదే సమస్య బారిన పడింది. ఆమెకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. రక్తకణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పాటు డెంగీ జ్వరం సోకింది. అంతేకాక కిడ్నీ, లివర్ పనితీరు మందగించిందని అక్కడి వైద్యులు మరో ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే, ఇప్పటికే సుమారు రూ.18 లక్షలు వెచ్చించిన రవికుమార్ కుటుంబం మరింత వెచ్చించ లేక ఆర్థికంగా సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు తమ కుమార్తె చికిత్సకు దాతలు చేయూతనివ్వాలని కోరుతున్నారు.

దాతలు సంప్రదించాల్సిన నంబర్ :
97017 27989
(ఫోన్ పే, గూగుల్ పే)

వైద్యం వికటించి బాలుడు మృతి

కొణిజర్ల: ఓ ప్రైవేట్ వైద్యుడు చేసిన చికిత్స వికటించి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని సింగరాయపాలెం (అల్లీపురం)లో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాలుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్రా నరసింహారావు - రాజ్యలక్ష్మి ఏకైక కుమారుడు సాయి(13) నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. దీంతో గ్రామంలోని ఓ ప్రైవేట్ వైద్యుడు చికిత్స చేస్తూ క్యాన్‌లా పెట్టి శనివారం ఇంజక్షన్ చేశాడు. ఆ తర్వాత కాసేపటికే బాలుడు నురగలు కక్కుతూ కనుమూశాడు. దీనికి వైద్యం వికటించడమే కారణమని బంధువులు ఆరోపిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. కాగా, చాలా గ్రామాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తూ దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే, సింగరాయపాలెం బాలుడి మృతి నేపథ్యాన గ్రామపెద్దలు సదరు వైద్యుడితో చర్చిస్తున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో యువకుడు...


నాగకార్తీక్‌రెడ్డి (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని నారాయణపురానికి చెందిన ఇంటర్ విద్యార్థి నరెడ్ల నాగకార్తీక్‌రెడ్డి (17) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆయన శనివారం సాయంత్రం తమ కోళ్లఫామ్ షెడ్‌కు వెళ్లాడు. అక్కడ లైట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై ఘటనా స్థలంలో మృతి చెందాడు. ఘటనపై కార్తీక్‌రెడ్డి తండ్రి నాగమల్లేశ్వరరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. కాగా, వినాయకచవితి పర్వదినాన ఈ ప్రమాదం జరగడంతో విషాదం అలుముకుంది.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు...

పెనుబల్లి: విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని బయ్యన్నగూడెంనకు చెందిన కోటగిరి సత్యనారాయణ - సత్యవతి(70) దంపతులు పదేళ్లుగా లంకసాగర్ శివారు మొక్కజొన్న ఫ్యాక్టరీ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆదివారం ఇంటికి ఉన్న ఇనుప కడ్డీలు, రేకులకు విద్యుత్ సరఫరా అయింది. ఈ విషయం తెలియక కడ్డీలు పట్టుకున్న సత్యవతి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఫ్యాక్టరీ యజమాని నిర్లక్ష్యం కారణంగానే సత్యవతి మృతి చెందిందని స్థానికులు ఆరోపిస్తుండగా ఆమె కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

ఖమ్మంలో ట్రాఫిక్ ఇక్కట్లు

- భారీ వాహనాలన్నీ కరుణగిరి వంతెన మీదుగానే..
- కాల్వొడ్డు మీదుగా కార్లు, ఆటోలు, బైక్‌లకే అనుమతి
- ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి మరమ్మతులు అయ్యే వరకు ఇదే పరిస్థితి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంక్రైం: వర్షాలు, వరదల కారణంగా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. ప్రధానంగా ఖమ్మంలోని బైపాస్, కాల్వొడ్డు, బోనకల్ రోడ్డు మార్గాల్లో వాహనాల రద్దీ పెరిగింది. ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై రాకపోకలు పూర్తిగా నిలిపివేయడంతో అటువైపుగా నగరంలోకి వచ్చి, వెళ్లే వాహనాలన్నీ కాల్వొడ్డు, కరుణగిరి బ్రిడ్జిల మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో అక్కడ తాకిడి పెరిగింది. ఇక ముంపు ప్రాంతాల్లో జరుగుతున్న పనులు, పరిస్థితులను పరిశీలించేందుకు వస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ముఖ్యులతో తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది.

ధర్నాతో బైపాస్‌పైకి ట్రాఫిక్

కవిరాజ్‌నగర్ ప్రాంతంలో ముంపు సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఆదివారం వైరా రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో వాహనాలన్నింటినీ మళ్లించారు. వైరా వైపు నుంచి ఖమ్మంలోకి వచ్చే వాహనాలను బైపాస్‌కు మళ్లించడంతో రద్దీ పెరిగి ట్రాఫిక్ జామ్ అయింది. ఓపక్క వర్షం, మరో పక్క మళ్లింపుతో బైపాస్ రోడ్డు కిటకిటలాడింది.

దారి మళ్లింపు ఇలా..

- భారీ వాహనాలన్నీ శ్రీశ్రీ సర్కిల్ - బైపాస్ రోడ్డు మీదుగా కరుణగిరి వంతెన, వరంగల్ క్రాస్ రోడ్డు మీదుగా వెళ్లాలి.
- పాత బస్టాండ్ నుంచి కోదాడ, వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను పాత బస్టాండ్ - మయూరిసెంటర్ బ్రిడ్జి - జూబ్లీక్లబ్ - నెహ్రూనసర్కిల్ - ఎఫ్‌సీఐ గోడౌన్ - కరుణగిరి - వరంగల్ క్రాస్ రోడ్డు నుంచి నడిపిస్తారు.
- కొత్త బస్టాండ్ నుంచి కోదాడ, వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కొత్త బస్టాండ్ - కరుణగిరి బ్రిడ్జి - వరంగల్ క్రాస్ రోడ్డు నుండి రాకపోకలు సాగిస్తాయి.
- బైక్‌లు, కార్లు, ఆటోలు తదితర వాహనాలన్నీ పాత మున్నేరు వంతెన (కాల్వొడ్డు) గుండా వెళ్లేందుకు అనుమతిస్తారు.

మరమ్మతులు పూర్తయ్యేవరకు..



ఖమ్మంలోని ప్రకాష్‌నగర్ బ్రిడ్జికి మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల రాకపోకలు కొనసాగించాలి. ఇటీవల వరదతో మున్నేరుపై ప్రకాష్‌నగర్ వద్ద బ్రిడ్జిపై స్పాన్ బేరింగ్ పక్కకు జరగడంతో ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతుల కోసం రాకపోకలు నిలిపేశారు. తదుపరి ప్రకటన వెలువడేవరకు పాత మున్నేరు కాల్వొడ్డు వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలు నిలివేస్తున్నాం.

–సునీల్‌దత్, ఖమ్మం పోలీస్ కమిషనర్

పాలేరుకు స్వల్పంగా పెరిగిన వరద

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం స్వల్పంగా పెరిగింది. ఉదయానికి 3,800 క్యూసెక్కులుగా ఉన్న వరద సాయంత్రానికి 5 వేల క్యూసెక్కులకు చేరింది. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం 21.5 అడుగులుగా నమోదైంది. రిజర్వాయర్ అలుగులు, మినీ హైడల్ కాల్వ ద్వారా 4,600 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. అయితే, ఎగువన మహబూబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌కు వరద మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. కాగా, వారం కిందట వచ్చిన వరదలకు ఎడమ కాల్వ కట్టలు తెగిన విషయం విదితమే. ఈ మేరకు కట్టల మరమ్మతు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు.


కాల్వ కట్టకు గండి పడిన ప్రాంతంలో సిద్ధం చేసిన కంకర డస్ట్ బ్యాగ్‌లు

19.5 అడుగులకు చేరిన వైరా రిజర్వాయర్

వైరా: వైరాలోని రిజర్వాయర్ నీటి మట్టం రెండు రోజుల్లోనే 19.5 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా, అంతకు మించి నీరు చేరడంతో ఐదు అలుగుల ద్వారా సుమారు 7 వేల క్యూసెక్కుల వరద వైరా నది ద్వారా కృష్ణా నదిలోకి వెళ్తోంది. జలవనరుల శాఖ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ వంశీకృష్ణ రిజర్వాయర్, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. రాజీవ్‌నగర్, ఇందిరమ్మ కాలనీ నుంచి 40 కుటుంబాలను వైరా జెడ్పీఎస్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ వారికి భోజన వసతి కల్పించడంతో పాటు అవసరమైన సరుకులు అందజేశారు.


13వ వార్డులో రహదారిపైకి చేరిన వర్షపు నీరు

వరద బాధితులకు అండగా నిలుద్దాం

కూసుమంచి: వరదలతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు అందరూ అండగా నిలవాలని జిల్లా పరిషత్ సీఈఓ దీక్షా రైనా పిలుపునిచ్చారు. వరద బాధితుల సహాయార్థం నగదు, దుస్తులు ఇతర వస్తువులను అందించేందుకు 'నా ఖమ్మం కోసం నేను' పేరిట గణేశ్ మండపాల వద్ద ఏర్పాటు చేసిన బాక్సుల్లో ప్రజలు విరాళాలు వేయాలని సూచించారు. కూసుమంచిలోని అయ్యగారి సెంటర్‌లో వినాయక విగ్రహం వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బాక్స్‌లో ఆదివారం సీఈఓతో పాటు డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి నగదు విరాళంగా వేశారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ.. ప్రజలు తమకు తోచినంత సాయాన్ని వరద బాధితులకు అందించి చేయూతనివ్వాలని కోరారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్, గ్రామ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ సీఈఓ దీక్షా రైనా వరద ముంపు ప్రాంతమైన జలగంనగర్‌లో ఆదివారం పర్యటించారు. జలగంనగర్ జెడ్పీహెచ్ఎస్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఆమె త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే, రామ్‌లీలా ఫంక్షన్ హాల్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించి బాధితులకు వసతులు, భోజనంపై ఆరా తీశారు.


దుస్తులు అందిస్తున్న వారిని అభినందిస్తున్న సీఈఓ దీక్షా రైనా